## మూసీ నది బ్రిడ్జిల నాణ్యత తనిఖీ

- ఇంజనీరింగ్ నిపుణులతో అధ్యయనం

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ): మూసీ నదిపై ఇప్పటికే ఉన్న బ్రిడ్జిల నాణ్యతను అధ్యయనం చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌డీసీఎల్) చర్యలు చేపట్టింది. గండిపేట నుంచి గౌరెల్లి ఔటర్ రింగు రోడ్డు దాకా పారుతున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేను అధికారులు పూర్తి చేశారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) చేసి మూసీకి ఇరువైపులా సరిహద్దులను నిర్ణయిస్తున్నాయి. అదే విధంగా మూసీ నదిపై ఇప్పటికే ఉన్న బ్రిడ్జీల నాణ్యతను అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా ఇంజనీరింగ్ నిపుణులను నియమించనుంది. గండిపేట నుంచి గౌరెల్లి దాకా పారుతున్న మూసీ నదిపై ఇప్పటికే మొత్తం 17 బ్రిడ్జీలు ఉన్నాయని, వాటన్నింటినీ ప్రత్యేకంగా పరిశీలించి వాటి నాణ్యతపై నివేదిక ఇస్తారని అధికారులు తెలిపారు.

### మూసీ నదిపై ఉన్న బ్రిడ్జీలు...

- టిప్పుఖాన్ బ్రిడ్జి (పాతది)
- టిప్పుఖాన్ బ్రిడ్జి (కొత్తది)
- బాపూఘాట్
- అత్తాపూర్
- పురానాపూల్ (పాతది)
- పురానాపూల్ (కొత్తది)
- ముస్లింజంగ్ బ్రిడ్జి (పాతది)
- ముస్లింజంగ్ బ్రిడ్జి (కొత్తది)
- నయాపూల్ (పాతది)
- నయాపూల్ (కొత్తది)
- సాలార్‌జంగ్ బ్రిడ్జి
- చాదర్‌ఘాట్ బ్రిడ్జి
- గోల్నాక బ్రిడ్జి
- నాగోల్ బ్రిడ్జి (పాతది)
- నాగోల్ బ్రిడ్జి (కొత్తది)
- ఇమ్లీబన్ పార్కు (లోపలి వెళ్లేది)
- ఇమ్లీబన్ పార్కు (బయటకు వచ్చేది)

## సీఎస్ఐఆర్ లేబొరేటరీస్‌లో వన్ వీక్.. వన్ థీమ్

- నేటి నుంచి దేశ వ్యాప్తంగా అమలు
- హైదరాబాద్‌లో మూడు ప్రధాన లేబొరేటరీలు

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ): కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో నేటి నుంచి వన్ వీక్... వన్ థీమ్ కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. జూన్ 28 నుంచి డిసెంబర్ వరకు జరిగే ఈ వేడుకల్లో దేశంలోని అన్ని సీఎస్ఐఆర్ రీసెర్చ్ సెంటర్లను జనాలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగంపై జనాలకు అవగాహన కల్పించి, భావితరాలకు విజ్ఞానాన్ని అందించేలా ప్రతి ఏటా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గతేడాది వన్ వీక్... వన్ ల్యాబ్ పేరిట రీసెర్చ్ సెంటర్లను సందర్శించే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించగా, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈసారి వన్ వీక్... వన్ థీమ్ పేరిట నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. నేటి నుంచి మొదలై డిసెంబర్ 17 వరకు జరిగే వేడుకల్లో శక్తి వనరులు, రసాయన, పెట్రో కెమికల్స్, ఎయిరోస్పేస్, సివిల్ ఇన్‌ఫ్రా, అగ్రి, న్యూట్రిషన్-బయోటెక్, హెల్త్ కేర్, మైనింగ్, ఖనిజాలు, లోహాలు, పర్యావరణంతో కూడిన అంశాలకు సంబంధించిన వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు, ఆయా లేబొరేటరీల్లో జరుగుతున్న ప్రయోగాలను ప్రదర్శించనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రధానమైన మూడు లేబొరేటరీలు పనిచేస్తున్నాయి. సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, ఐఐసీటీతో పాటు, సీఎఫ్‌టీఆర్ఐ అనుబంధ సెంటర్, ఎన్ఈఈఆర్ఐ సంస్థలు కూడా ఉన్నాయి.

# బస్సు రాక కోసం.. పడిగాపులు



ఒక వైపు బస్సు రాక కోసం పడిగాపులు కాస్తుండగా, మరోవైపు భానుడి భగభగలు వెంబడిస్తున్నాయి. ఎంత చికాకు పడినా.. చిర్రెత్తినా.. వెయిట్ చేయాల్సిందే..! బస్సు రాదు.. ఎండ తగ్గదు... రాని బస్సుల కోసం వేచి ఉండక తప్పదు. సాధారణ ప్రజలకు బస్సే ప్రధాన ప్రయాణ సాధనం. వీరి పరిస్థితి పాలకులకు పట్టదు. ఎండకు ఎండుతూనే ఆ బస్సు కోసం పడిగాపులు కాయాల్సిందే. లేదంటే.. ఇలా ఓ చెట్టు నీడన సేద తీరాలి. తార్నాక నుంచి ఉప్పల్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం ఇది. ఈ దారిన పలు డిపోలకు చెందిన వందలాది బస్సులు రోజూ నడుస్తాయి. అయినా, ఆదివారం ఇటుగా ఒక్క బస్సు రాకపోవడంతో పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తార్నాకలోని ఆరాధన సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ప్రయాణికుల ఇబ్బందులు పాలకులకు పట్టేనా..!!

## సెయింట్ మార్టిన్‌లో ప్లేస్‌మెంట్ డే



సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగాల మేళాలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, పలువురు ప్రముఖులు

కుత్బుల్లాపూర్, జూన్ 23: దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్లేస్‌మెంట్ డే ఘనంగా జరిగింది. కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 1,168 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మరో 60 మంది ఎంఎన్‌సీఎస్‌లో అవకాశాలు పొందారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చంద్రశేఖర్‌యాదవ్, కళాశాల గ్రూప్ డైరెక్టర్ పి.సంతోష్ కుమార్ పాత్ర, డైరెక్టర్ జి.రాజశేఖర్‌యాదవ్, జి.జై కిషన్ యాదవ్‌లు తమ సందేశాన్ని అందించారు. సెయింట్ మార్టిన్ కళాశాల రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో చెప్పుకోదగ్గ మైలురాయిని చేరుకోవడం పట్ల అతిథులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆశ్చర్యపరిచే ప్లేస్‌మెంట్లను సాధించి కళాశాలకే వన్నెతెచ్చారని అభినందించారు. హైదరాబాద్ ఓహెచ్ఎం గ్రూప్ డైరెక్టర్ బాలక్రిష్ణ చాట్లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హత్యాకాండను నిలిపివేయాలి

చిక్కడపల్లి, జూన్ 23 : ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల హత్యాకాండను నిలిపివేయాలని పలువురు వక్తలు కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజ్ మాట్లాడుతూ.. నక్సలైట్ల పేరుతో అమాయక ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో శాంతియుత వాతావరణం ఏర్పాటు కావాలని కోరుకుంటున్నామని, కానీ.. అమాయక ఆదివాసీలను ఎన్‌కౌంటర్లు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జీవనాధారం కోసం ఆడవిలోకి వెళ్తున్న ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మండిపడ్డారు. వేదిక నేత, ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశ్యాప్తంగా ఆదివాసీ తెగలన్నీ తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలన విధానాల వల్ల, కార్పొరేటర్ ఆర్థిక విధానాల పర్యవసానాలు ఆదివాసుల జీవితాలను మరింత ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీల హత్యాకాండను నిలిపివేయాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు బెల్లయ్య నాయక్, ప్రముఖ సాహితీవేత్త శివారెడ్డి, నారాయణ, నాగభూషణం, రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజ్



కోఠిలో మాట్లాడుతున్న టీ-జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శ్రీసాయి హర్ష

# నేటి నుంచి టీ జూడాల నిరవధిక సమ్మె

- నిలిచిపోనున్న ఓపీ, ఎలక్టివ్ సర్జరీలు, వార్డు డ్యూటీల సేవలు

సుల్తాన్‌బజార్,జూన్ 23: జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు టీ-జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ శ్రీసాయి హర్ష పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కోఠిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ నిరవధిక సమ్మెలో జూనియర్ డాక్టర్లందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ సమ్మెతో ఔట్ పేషెంట్(ఓపీ ) సేవలు, ఎలక్టివ్ సర్జరీలు, వార్డు డ్యూటీలను పూర్తిగా బహిష్కరిస్తున్నామని అన్నారు. జూడాల విధి నిర్వహణ పరిస్థితులు, వేతనాల మోతాదు, ఆరు నెలలుగా స్టైఫండ్ ఇవ్వకపోవడం, జూనియర్ డాక్టర్లకు రక్షణ, భద్రత వంటి అంశాల సమస్యలపై సంబంధిత అధికారులతో పలుమార్లు చర్చించినా పరిష్కారం లభించకపోవడంతో సమ్మెను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. జూనియర్ డాక్టర్ల సమస్యలు సమగ్రంగా పరిష్కరించేంత వరకు ఈ సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ సమ్మెవల్ల రోగులు, సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం పట్ల టీ జూడా పక్షాన చింతిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దవాఖానల్లో అత్యవసర సేవలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

## నీట్‌తో పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలి

సుల్తాన్ బజార్, జూన్ 23: నీట్ పరీక్షా పత్రం లీకేజీ నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేయడంతో పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణమే భర్తరఫ్ చేయాలని తెలంగాణ యూత్ కాంగ్రెస్ నేత శివసేనారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా, గాంధీభవన్ నుంచి బీజేపీ కార్యాలయానికి ముట్టడికై తరలుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను గాంధీభవన్ గేట్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్ గేట్లు దూకి ముందుకు సాగేందుకు ప్రయత్నించిన క్రమంలో పోలీసులకు యూత్ కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో గాంధీ భవన్ వద్ద కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ ముదిరాజ్, ప్రేమ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువు..

- సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేశ్



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేశ్

ముషీరాబాద్, జూన్ 23: భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన తెలంగాణ ప్రగతిశీల భవన, నిర్మాణ కార్మిక సంఘం గ్రేటర్ కమిటీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు భద్రత లేకుండా పోయిందని, గత పక్షం రోజులుగా పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని అన్నారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును మెరుగుపర్చాలని కోరారు. కార్మికులు ప్రమాదానికి గురైతే ఇచ్చే పరిహారాన్ని రూ.పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నల్లన్న, నాయకులు వెంకటేశ్, రామకృష్ణ, ప్రవీణ్, మల్లేశ్, నరసింహ, మహదేవ్, నగేశ్, అనీఫ్, బాలు, తిరుపతిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగించి ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఒలింపిక్ డే రన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి జూన్ 23: అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా నగరంలో ఒలింపిక్ డే రన్‌ను గ్రేటర్ హైదరాబాద్‌లోని పది కేంద్రాల నుంచి అతి పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లాల్ బహదూర్ స్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్ కేంద్రం నుంచి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసన మండలి సభ్యుడు, ఒలింపిక్ డే రన్ కమిటీ చైర్మన్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ అబ్కారీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, పల్లవి ఇంటర్నేషనల్ విద్యా సంస్థల చైర్మన్ కొమరయ్య, అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణి ప్రియాంక సాగర్‌లతో వెయ్యి మంది క్రీడాకారులు విద్యార్థులతో రన్ కొనసాగింది. లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రభుగౌడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి రన్ జరిగిది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి నుంచి జగన్ మోహన్ గౌడ్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జీపీ ఫాల్గుణ ఆధ్వర్యంలో రన్ ప్రారంభించారు. చార్మినార్ నుంచి తెలంగాణ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్యదర్శి పి.ఇమాన్యుయేల్, మహేష్, చాదర్‌ఘాట్ విక్టోరియా మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో హరిదాస్, షౌకత్ అలీ నాయకత్వం వహిస్తూ రన్‌ను ముందుకు సాగించారు. వివిధ కూడళ్ల నుంచి తీసుకువచ్చిన క్రీడా జ్యోతులను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు, శాసన మండలి సభ్యుడు, ఒలింపిక్ డే రన్ కమిటీ చైర్మన్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అందుకొని జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కే.మహేశ్ సాగర్, చాతిరి బాబూరావు సాగర్, ప్రేమ్‌రాజ్, మధు, జగన్ మోహన్ గౌడ్, బి.వెంకటేష్, విజయ్‌పాల్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంప్ దినేష్ సింగ్



రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంప్ విజేతలతో రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హంజా బీన్ ఒమర్, హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖలీఫా

హైదరాబాద్, ఆట ప్రతినిధి జూన్ 23: తెలంగాణ రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ టైటిల్‌ను టి.దినేష్ సింగ్ కైవసం చేసుకున్నారు. యాఖుత్‌పురాలోని అలి వస్తాదా హకాడలో ఆదివారం జరిగిన ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఫైనల్స్‌లో దినేష్ సింగ్ 13-5 పాయింట్ల తేడాతో శ్రీనివాస్‌పై విజయం సాధించారు. గ్రీక్ రోమన్ స్టైల్ రెజ్లింగ్ ఫైనల్స్‌లో ఓమర్ 12-07 పాయింట్ల తేడాతో విజయ యాదవ్‌పై గెలుపొందారు. వినయ్ కుమార్, ఉదయ రాజ్, బి.దినేష్, ఎస్కే సోయబ్, వెంకటరామణ, ఏ.శోభేష్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హంజా బీన్ ఓమర్, హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాసిర్ ఖలీఫా, లింగం పల్వాన్, స్యూరి, సానీ తదితరులు బహుమతులు అందజేశారు.

## హామీలను కాంగ్రెస్ పార్టీ తక్షణమే అమలు చేయాలి



ముదిరాజ్‌ల డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలంటూ అభివాదం చేస్తున్న ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు శివ ముదిరాజ్, నాయకులు

సుల్తాన్ బజార్, జూన్ 23: ఎన్నికల సమయంలో ముదిరాజ్‌ల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వై.శివ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ముదిరాజుల సామాజిక న్యాయం-హక్కుల కోసం దిశ-దశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం కోకాపేటలో కేటాయించిన ముదిరాజ్ కుల భవనానికి సంబంధించిన సమీక్ష నిర్వహించి తక్షణమే ఆ భవన నిర్మాణానికి గాను నిధులను కేటాయించాలన్నారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ముదిరాజ్ కులస్తులకు ఎనిమిది నామినేటెడ్ చైర్మన్ పదవులను కేటాయించాలన్నారు. తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మొర రవికాంత్ ముదిరాజ్, అనిల్ కుమార్ ముదిరాజ్, శ్రీహరి ముదిరాజ్, నరసింహులు ముదిరాజ్, శివ ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, బ్రహ్మ ముదిరాజ్, సాయి కిరణ్ ముది రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా పరిరక్షణ అభినందనీయం




అవార్డు గ్రహీతలతో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, బడే సాబ్, తదితరులు

రవీంద్రభారతి, జూన్ 23: తెలుగు భాషా పరిరక్షణ అనేది అభినందనీయమైన కార్యక్రమం అని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలుగు కవితా వైభవం (తెలుగు అభివృద్ధి సమితి), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో 'తెలుగు కవితా వైభవం - దశాబ్ది ఉత్సవాలు, ఒకరోజు కవిరాణి - కవిరాజు, తెలుగు బంధు బిరుదులు' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథిగా పూర్వ రిజిస్ట్రార్ డా.బి.గౌరీశంకర్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, ఇంతమంది కవులు తెలుగు భాష గురించి, భాష పరిరక్షణ గురించి మాట్లాడటం ఎంతో అభినందనీయమన్నారు. 'తెలుగు భాష పరిరక్షణ' అనే సంకల్పం చాలా గొప్పది. గత ఐదేండ్లుగా తెలుగు భాష కుంటుబడి పోయింది. తెలుగు భాష పరిరక్షణకు కవులు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభా అధ్యక్షుడిగా మేక రవీంద్ర వ్యవహరించగా, కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు టి.కిషన్ రావు, ప్రొఫెసర్ నాళేశ్వరం శంకరం, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలుగు భాషా చైతన్య సమితి చైర్మన్ బడే సాబ్, దాసోజు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## గోవులను రక్షించిన మహిళలు అభినందనీయులు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సిటీబ్యూరో, జూన్ 23(నమస్తే తెలంగాణ): కబేళాలకు గోవులను తరలిస్తున్న ముఠాను వీరోచితంగా ఎదుర్కొని పోలీసులకు పట్టిచ్చిన మైథిలీ, సునీతలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. ఈ మేరకు ఆయన హిమాయత్‌నగర్‌లో ఆదివారం వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం, వారితో కలిసి భోజనం చేశారు. వారి కుటుంబ సభ్యుల వివరాలడిగి తెలుసుకున్నారు. కాగా, అల్వాల్‌లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం, దివంగత రామోజీరావు కుమారుడు, ఈనాడు ఎండీ కిరణ్ దంపతులను పరామర్శించారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేసుకున్న సిరిసిల్ల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను పరామర్శించారు.



## సెయిలింగ్ సెమినార్‌తో నౌకాయానానికి ముందడుగు

జూబ్లీహిల్స్, జూన్ 23: సెయిలింగ్ సెమినార్‌తో సెయిలింగ్ జడ్జింగ్‌లో తాజా నియమ నిబంధనలతో పాటు భారతదేశంలో నౌకాయానానికి ముందడుగు పడనుందని లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే (వీఎస్ఎం) పేర్కొన్నారు. నగరంలో సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ భారత్‌లో 15 ఏండ్ల సుదీర్ఘ విరామం తరువాత ఈ సెమినార్‌ను జూన్ 21 నుంచి 23 వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఎంసీఈఎంఈ కమాండెంట్, ఈఎంఈ కల్నల్ కమాండెంట్ ఆఫ్ కార్ప్స్, కమోడోర్ ఈఎంఈ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక సెమినార్‌ను నిర్వహించారు.



సెమినార్‌లో పాల్గొన్న లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే తదితరులు